క్లుప్తంగా

‘ఉద్యమకారులపై కేసు కొట్టివేయాలి’

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్ సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఉద్యమాలు చేసి రాష్ట్రం సాధించిన పాలకులకు రాష్ట్రాన్ని అప్పగిస్తే ఉద్యమకారులను పట్టించుకోలేదని, 2011 సకల జనుల సమ్మెలో 28మంది ఉద్యోగులపై కేసులు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు.

పీఆర్డీ క్యాంప్ లీడర్‌గా అర్జున్‌కుమార్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించే ప్రీఆర్డీ క్యాంప్ కాంటినెంట్ లీడర్‌గా పీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్‌కుమార్‌ను నియమించడం చాలా సంతోషంగా ఉందని వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు క్యాంప్‌లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి పీయూకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

జీపీ స్థలాన్ని రక్షించాలి

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లిలో సర్వే నంబరు 308లో చేసిన వెంచరులో జీపీ స్థలాన్ని రక్షించాలని గ్రామానికి చెందిన శ్రీనివాసులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. గతంలో మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనలేదని, మీరైనా స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీపీ స్థలానికి కేటాయించి దానిని తిరిగి ప్లాట్లుగా మార్చి విక్రయించారని పేర్కొన్నారు.

బదిలీ టీచర్‌కు సన్మానం



అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండా పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవమ్మ ఇటీవల పదోన్నతి పొంది మూసాపేట మండలం నందిపేట పాఠశాలకు బదిలీ అయ్యారు. సోమవారం తిమ్మాయిపల్లి తండా పాఠశాలలో ఆమెను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, లక్ష్మణ్‌గౌడ్, మలేఖాబేగం, పద్మావతి, అన్వర్ హుస్సేన్, సత్యనారాయణ, అరుణకుమారి, నర్మద, గాయత్రి ఉన్నారు.

టెట్‌లో మినహాయింపు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తపస్ సంఘం నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. 2010 కన్న ముందు విధుల్లో చేరిన వారికి ఎన్సీటీఈ మినహాయింపు ఇచ్చిందని, అర్హులైన వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో క్షయ, షుగర్, బీపీ, హెచ్‌ఐవీ, కొలెస్ట్రాల్‌కు వందమంది నుంచి రక్త శాంపిల్స్ సేకరించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయ్యూబ్ ఖాన్, సూపర్‌వైజర్లు సునంద, ప్రసాద్, దేవయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం

మహమ్మదాబాద్: అర్ధరాత్రి ఓ గర్భిణికి పురుటినొప్పులు రావడంతో అంబులెన్సులోనే తీసుకెళ్తుండగా ప్రసవించింది. మండలంలోని ఎన్కిచెరువుతండా అనుబంధ గ్రామమైన బోయగుడిసెలుకు చెందిన బోయ భీమమ్మకు ఆదివారం అర్ధరాత్రి పురుటినొప్పులు వచ్చాయి. వెంటనే 108కు సమాచారం అందించగా.. గండేడ్ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో నంచర్లగేట్ సమీపంలో 1:15 గంటలకు ప్రసవించి పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 ఈఎంటీ జానమ్మ, పైలెట్ అక్బర్ తెలిపారు.



ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిర బోయి
- స్వస్త్‌నారీ.. సశక్త్ పరివార్ పోస్టర్ల ఆవిష్కరణ

పాలమూరు: స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఈనెల 17నుంచి అక్టోబర్ 2వరకు మహిళలు, పిల్లలకు నిర్వహించే ఆరోగ్య పరీక్షల్లో అతివలు అధికంగా పాల్గొనేలా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వస్త్‌నారీ.. సశక్త్ పరివార్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 17న ప్రధాని మోదీ వర్చువల్‌గా కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేరోజు బాలానగర్ పీహెచ్‌సీలో ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలతో మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వాటిలో మహిళలు, పిల్లలకు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి కంటి, రక్తపోటు, షుగర్, దంత, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, గర్భిణులకు రక్తహీనత, క్షయ, ఎనీమియా పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు, ఆశలు, ఏఎన్‌ఎంలు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణ, ఆరోగ్య శాఖ అధికారులు శశికాంత్, మంజుల, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని బోయపల్లిగేట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాల భవనాన్ని సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. నిర్మాణ పురోగతి ఏస్థాయిలో ఉందంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల భవనం, కిచెన్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ భవనాలు అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని, అదే విధంగా డార్మిటరి భవనం డిసెంబర్ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక పార్క్

పాలమూరు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్టీఏ జిల్లా అధికారులు ప్రస్తుత ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జిల్లా కేంద్రంలోని పంచవటి పాఠశాలలో ట్రాఫిక్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థి దశ నుంచే నిబంధనలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గించడంతో పాటు ముందుతరం క్రమశిక్షణతో నిబంధనలు పాటించి వాహనాలు నడిపే అవకాశం ఉంటుందని రవాణా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ పార్క్‌ను సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించి పరిశీలించారు. పార్క్‌ను పరిశీలించిన కలెక్టర్ కొన్ని మార్పులు చేయడంతోపాటు అదనంగా కొన్ని అంశాలను జోడించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటీసీ సదానందం, ఆర్టీవో రఘుకుమార్, ఎంవీఐ వాసుదేవ్ రావు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును కలెక్టర్‌కు వివరిస్తున్న ఎంవీఐ వాసుదేవ్‌రావు

ఆందోళన.. ఆవేదన.. ఆక్రోశం



నవాబుపేట రైతువేదిక వద్ద రైతుల క్యూలైన్

నవాబుపేట/అడ్డాకుల/జడ్చర్ల: అన్నదాతలు యూరియా కోసం ఆవేదన వ్యక్తం చేసి రోడ్డెక్కి ఆందోళన చేశారు. వారిని అడ్డుకున్న పోలీసులతో ఆవేశంగా వాదనకు దిగారు. సోమవారం అన్నదాతలు మండల కేంద్రానికి యూరియా కోసం రావడంతో యూరియా లేదని తెలిసి రోడ్డుపై నిల్చొని ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని వారిస్తుంటే వాగ్వాదానికి దిగారు. రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ అధికారులతో మాట్లాడి యూరియా అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, యూరియా వచ్చిన అనంతరం రైతువేదిక వద్ద పెద్ద ఎత్తున క్యూలు కట్టారు. కొందరికే దొరికాయి.

■ మూసాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు. కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఏఓ అనిల్‌కుమార్ హామీతో ఆందోళనను విరమించారు.



పోలీసులతో వాదనకు దిగిన మహిళా రైతులు

■ జడ్చర్లలో యూరియా కోసం రైతులు బారులుదీరారు. సోమవారం ఉదయం నుంచే ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాశారు. ఒక్క రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తుండడంతో పంటలకు సరిపోవడం లేదని, మళ్లీ మళ్లీ దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోయారు. సిగ్నల్‌గడ్డ-నేతాజీ చౌరస్తా ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న కోరమండల్ ఎరువుల దుకాణం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు భారీగా నిరీక్షించారు. కొంతసేపటి తర్వాత యూరియా స్టాకు అయిపోవడంతో రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.



మూసాపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

రైతాంగానికి రూ.2,148 కోట్ల రుణాలు

జడ్చర్ల: నియోజకవర్గంలోని రైతులకు ఈ ఏడాది రూ.2148 కోట్ల బ్యాంకు రుణాలను పంపిణీ చేసే విధంగా నిర్ణయించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాదికంటే రూ.472కోట్లు అధికంగా బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలిపారు. పంట రుణాలకు సంబంధించి రూ.1,140 కోట్లు కేటాయించగా వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1,008 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కావొద్దని, బ్యాంకుల ద్వారా పంట రుణాలను సరళీకృత విధానంలో అందించాలని ఇప్పటికే సంబంధిత బ్యాంకు అధికారులను కోరామన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో యూరియా ఇబ్బందులు తలెత్తాయన్నారు. అయితే ఇప్పటికే 9,134 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని, మిగతావారికి సరిపడా యూరియాను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీసీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వెంకటేశ్వర కాలనీలోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో, ఏనుగొండలోని భరత్‌నగర్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు.

బ్యాంకు లింకేజీ యూనిట్లు పెంచాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)లో బ్యాంకు లింకేజీ ద్వారా ఎక్కువ యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని మెప్మా పీడీ మహమ్మద్ యూసుఫ్ ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సీఓలతో సమీక్షించారు. ఇప్పటి వరకు లక్ష్యంలో 20శాతమే బ్యాంకు లింకేజీ కింద యూనిట్లు ఏర్పాటు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నగర పరిధిలో కొత్త సంఘాలు 660కిగానూ 80 మాత్రమే చేయడమేమిటని ప్రశ్నించారు. త్వరలోనే ఎస్‌హెచ్‌జీలకు దసరా కానుకగా రెండేసి చీరలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంసీ లక్ష్మి, సీఓలు వరలక్ష్మి, దేవమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలను వేధిస్తున్నారని ఫిర్యాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పలువురు విద్యార్థి సంఘాల ముసుగులో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలను వేధిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ విజయేందిర బోయికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా వ్యాపారాలు నడిపి ఇప్పుడు విద్యార్థి సంఘాల ముసుగు వేసుకుని ఆర్టీఐలు వేస్తూ, యాజమాన్యాల మీద ఫిర్యాదులు చేస్తూ వారిని ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఇటువంటివారిపై పోలీసులు సైతం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, లక్ష్మణ్, శ్రీనాథ్, భరత్, రమేశ్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు భరత్, శోభన్, రామకృష్ణ, అల్తాఫ్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు సంతోష్, మహేశ్‌బాబు, వెంకట్ పాల్గొన్నారు.

లక్ష్మీపల్లి రోడ్డు పనులు చేపట్టాలి

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి స్టేజీ నుంచి లక్ష్మీపల్లి మీదుగా వేముల జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సోమవారం దేవరకద్ర ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు ఫిర్యాదు చేశారు. చౌదర్‌పల్లి, హజిలాపూర్, లక్ష్మీపల్లి వరకు రోడ్డుంతా గుంతలు పడి అధ్వానంగా తయారైందని, వాహనాల రాకపోకలకు నరకం చూస్తున్నామని ఆరోపించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు ఇవ్వాలి



భూత్పూర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



నవాబుపేటలో ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

జడ్చర్ల/నవాబుపేట/భూత్పూర్: దివ్యాంగులకు 6వేలు, వృద్ధులకు 4వేల పింఛను వెంటనే అమలు చేసి అందించాలని ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల పోరాట సమితీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం జడ్చర్ల, నవాబుపేట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా తహసీల్దార్‌కు అందజేశారు.

■ భూత్పూర్‌లో తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో శాంతయ్య, జైపాల్, వీరేశ్, బాల్‌రాజ్, శ్రీను, శంకర్, బాలయ్య, కృష్ణ బాల్‌రాజ్, నాగరాజు, సత్యం, శ్రీను, భీంరాజ్, బిచ్యానాయక్, రామ్మోహన్, యాదయ్య, గడ్డం యాదయ్య, సత్యం, శేఖర్, బాలకృష్ణమ్మ, నాగయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మిడ్జిల్: ఆసరా, వికలాంగుల పింఛన్లు పెంచాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సురేశ్‌మాదిగ, పింఛనుదారులు పాల్గొన్నారు.

దేవరకద్ర: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6వేల పింఛను ఇస్తామని ప్రకటించి మోసం చేసిందని ఆరోపిస్తూ సోమవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయాన్ని దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ముట్టడించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆయా దివ్యాంగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం ఆందోళన చేశారు. పింఛను పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్ డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ దీపికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేందర్, పారిజాత, వెంకటేశ్, శ్రీలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

పాలమూరు: జిల్లాలో హైరిస్క్ గ్రామాల్లో కళాజాత ప్రదర్శనల ద్వారా ఈనెల 22వ తేదీ వరకు ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం కళాజాత బృందం వాహనాన్ని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిరోజూ నాలుగు గ్రామాల్లో సందర్శించి ప్రజలకు ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శశికాంత్, భాస్కర్ నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వాహనం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మిడ్జిల్‌లో మాట్లాడుతున్న జడ్జి ఇందిరా

మిడ్జిల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, గొప్పస్థాయికి ఎదుగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా సూచించారు. సోమవారం ఎంవీఎస్ గార్డెన్‌లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నిర్వహించిన వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులు జడ్జి హాజరై మాట్లాడారు. విద్యార్థినులు సమాజంలో దేనికీ భయపడకుండా అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని సూచించారు. బాలికలను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నట్లు గుర్తిస్తే 1908కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ.. ప్రతి ఆడపిల్లలో 10నుంచి 18ఏళ్ల మధ్యలో శారీరక మార్పు వస్తుందని, ఎక్కువ శాతం బాలికలకు మినిస్ట్రస్ సైకిల్ ప్రారంభమవుతుందని తెలిపారు. సరైన అవగాహన లేకపోతే భయపడే అవకాశం ఉందన్నారు. బాలిక తమ శరీరాన్ని అర్థం చేసుకుంటే భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. అనంతరం మత్తుకు దూరంగా ఉండాలని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశాజ్యోతి, శివకాంత్, సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, ఎంఈఓ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు గౌస్, సంపత్, వనజ, కృష్ణకుమార్, శివప్రసాద్, రాజేశ్, రాఘవేందర్, శ్రీను, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ హాస్టల్ వర్కర్లను క్రమబద్ధీకరించాలి



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఆశ్రమ హాస్టల్ వర్కర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్ వర్కర్స్‌గా పని చేస్తున్న డైలీ వైజెస్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్ వర్కర్స్‌తో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్ వర్కర్స్ టైం స్కేల్ అమలు పరచాలని, జీఓ 64అమలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదునెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నాలుగు రోజులుగా ఆశ్రమ హాస్టల్ వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. తక్షణమే జీతాలు పాత పద్ధతిలోనే ఇవ్వాలని, వారాంతపు సెలవు, జాతీయ సెలవులు పీఎఫ్ ఈఎస్‌ఐ గ్రాట్యూటీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, సురేశ్, గణేశ్, బిచ్చ, జగదీశ్, అనసూయ, జ్యోతి, రుక్మిణి, స్వరూప, అనిత, భీమమ్మ, శ్రీలత, ఎల్లప్ప, అంజమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాజసింహుడు, రవీందర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన 2021, 2025 సంవత్సరాలకు సంబంధించిన రెండు వేతన సవరణలలో వెంటనే 2021 సంవత్సరానికి సంబంధించిన పే స్కేల్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన 2017 పేస్కేల్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల భార్య, భర్తకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించాలని కోరారు. వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలను వారు ఉండే స్థానిక ఆస్పత్రిలో చికిత్సలను అనుమతించాలని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ఖర్చు చేసిన మెడికల్ బిల్లులకు రీయింబర్స్‌మెంట్ ద్వారా తిరిగి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు అంజన్న, బుచ్చన్న, వెంకట్రాములు, మాణిక్‌రావు, డేవిడ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్‌గోండూలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నవాబుపేట: రాజ్‌గోండూలను వెంటనే ఎస్టీ జాబితాల నుంచి తొలగించాలని లంబాడి హక్కుల పోరాట సమితి, లంబాడి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం ఎల్‌హెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు సంతోష్‌నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంబాదాస్, తులసీరాంనాయక్, రాజునాయక్, లింబ్యానాయక్, గోపాల్, హరినాయక్, మంగేశ్, నర్సింహ, భగవాన్‌నాయక్, భాస్కర్, రవి, రాజు, ప్రకాశ్, లక్ష్మణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై డిగ్రీ కళాశాలలో ఒకరోజు వర్క్‌షాప్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో ఐబీఎం సహకారంతో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ విభాగం సంయుక్త సారథ్యంలో ఎమర్జింగ్ ఏఐ టెక్నాలజీస్ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంపై ప్రిన్సిపాల్ సుకన్య పాల్గొని ప్రసంగించారు. కృత్రిమ మేధాతో అనేక అద్భుతాలు సాధించడంలోనూ సహకరించే మంచి ఉపకరణంగా అభివర్ణించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుకన్య

భవిష్యత్‌లో ఏర్పడే పోటీతత్వానికి సంసిద్ధులు కావడానికి ఏఐ టూల్స్ ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులు ఐబీఎం సహకారంతో ఎంఎల్ మిషన్ లెర్నింగ్ సర్టిఫికెట్ కోర్సులను సమర్థవంతంగా అధ్యయనం చేయవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐబీఎం మాస్టర్ ట్రైనర్ అజయ్‌కుమార్ ఐబీఎం ద్వారా అందిస్తున్న వివిధరకాల సర్టిఫికెట్ కోర్సుల గూర్చి వివరించారు. కోర్సుల్లో ఎలా చేరాలి అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, జయలీల, వెంకట్‌రెడ్డి, వనిత, ఫాతిమా, శంకర్, వీరప్రతాప్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ ధర్నా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. విభాగ్ కన్వీనర్ నరేశ్‌తేజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 13లక్షల పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతున్నారని, ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో చాలామంది చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. సర్టిఫికెట్ల కోసం వెళ్తే ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించకపోతే కళాశాలలు ఎలా నిర్వహించాలని ప్రశ్నిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వం తమకేమీ సంబంధంలేనట్లు వ్యవహరిండం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, శివసాగర్, శివప్రసాద్, శివరాం, శ్రీకాంత్, నరేశ్, చరణ్, నవీన్, సిద్ధు పాల్గొన్నారు.

